క్లుప్తంగా

విరాళం అందజేత



మల్హర్: మండలంలోని కొయ్యూరు అభయాంజనేయ ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి రూ.5వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయ సన్నిధిలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు బాపురెడ్డి, రాజబాబురెడ్డి, మల్లారెడ్డి, నర్సారెడ్డి, శంకర్ రెడ్డి, చింటు, దుర్గం మల్లయ్య, నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నియామకం



గణపురం: మండలంలోని కొండాపురం మత్స్య సహకార సంఘం ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా శ్రీనివాస్ రావు వ్యవహరించగా నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చాడ కిష్టస్వామి, ఉపాధ్యక్షులుగా శామంతుల కుమారస్వామి, కార్యదర్శిగా మామిడి చిరంజీవి, కార్యవర్గ సభ్యులుగా పాశం రాము, దొంతుల మహేందర్ తదితరులను ఎనుకున్నారు. నూతన కమిటీని జిల్లా మత్స్యశాఖ అధికారి రావిశెట్టి అవినాష్, ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య అభినందించి నియామకం పత్రం అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక



భూపాలపల్లిరూరల్: జిల్లా బీసీ జర్నలిస్ట్ వర్కింగ్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షులు సామంతుల శ్యాం, బెల్లం తిరుపతి తెలిపారు. జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా సామల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పావుశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా పసుల రాజు, ఉపాధ్యక్షులుగా పల్నాటి రాజు, కుమార్ యాదవ్, సల్పాల తిరుపతి, పరమరాజుల శివకుమార్, రంజిత్, అధికార ప్రతినిధిగా జల్దీ రమేష్, ప్రచార కార్యదర్శిగా కుసుమ చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా లీగల్ అడ్వైజర్‌గా నడిపెల్లి రజినీకాంత్, ఈసీ మెంబర్‌లుగా చందు, వెంకటస్వామి, బూర రమేష్, కృష్ణమూర్తి, బ్రహ్మచారి, మురళికృష్ణ, సలహాదారులుగా అడ్డగట్ల శ్రీధర్, సమ్మయ్య, రమేష్‌లను, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా జాలిగం రాజును ఎన్నుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు నాగపూరి శ్రీనివాస్ గౌడ్, ఎడ్ల సంతోష్, సతీష్, వలీ పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



పలిమెల: మండలంలోని లెంకలగడ్డ గ్రామ పంచాయతీలో హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీని గురువారం ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో నర్సరీలో మొక్కలు చనిపోకుండా ప్రతి రోజు రెండు సార్లు నీళ్లు పట్టాలని, కలుపు మొక్కలు ఉంటే ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి తెలిపారు. పలు అంశాలపై ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రెటరీలకు సూచనలు చేశారు.

ఎంకవ్వ మృతి తీరని లోటు

పలిమెల: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోళపు ఎంకవ్వ మృతి గ్రామస్తులతో పాటు ఉద్యమానికి, ప్రజలకు, పార్టీకి తీరని లోటని సీపీఐ (మావోయిస్టు) పార్టీ జెఎండబ్ల్యూపీ డివిజన్ కార్యదర్శి వెంకటేశ్ గురువారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా పోరాడి భూములను పీడిత ప్రజలకు పంచాలని బయ్యపు దేవేందర్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొన్న ఎంకవ్వ జీవతం నేటి తరం ప్రజలకు, యువతకు ఆదర్శమన్నారు.

నిందితులను శిక్షించాలి

కాటారం: పదో తరగతి పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలని బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తూర్పాటి రజనీకాంత్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పరీక్షలు ప్రారంభమైన మొదటి రోజు నుంచి టెన్త్ పేపర్ వాట్సాప్‌లో ప్రత్యక్షమవడం శోచనీయం అన్నారు. ఇలాంటి పరిణామాలతో భవిష్యత్‌లో విద్యార్థులకు పరీక్షలపై విశ్వాసం పోయే అవకాశం ఉందన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా హనుమాన్ జయంతి



కాటారం: ధన్వాడ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు

కాటారం: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు ఆనందధర్మ శాస్త అయ్యప్ప స్వామి ఆలయం, ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవచనము, 51 కళశాలతో పంచామృత అభిషేకము, అష్టోత్రము, మన్యసూక్త, రుద్రసూక్త హోమం, బలిప్రదానము, మహాపూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలను సందర్శించి స్వామి వార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పురోహితులు మాడుగుల నాగరాజుశర్మ, గుండు భానుప్రసాద్‌శర్మ, నిఖిల్‌శాస్త్రి, కృష్ణమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆలయ అర్చకుడు మాడుగుల బాపుశర్మ, పవన్‌శర్మల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి మాల విరమణ చేశారు. దీంతో ఆలయంతో పాటు గోదావరి తీరంలో మాల విరమణ భక్తులతో సందడిగా మారింది. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

మల్హర్: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని మల్లారం, కొయ్యూర్ హనుమాన్ ఆలయాల్లో భక్తులు, అంజన్న దీక్ష స్వాములు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో విగ్రహానికి చందనం వేసి తమలపాకులు నైవేద్యంగా సమర్పించారు. అంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర స్తోత్ర పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.



మల్లారంలో పూజలు చేస్తున్న స్వాములు, భక్తులు



కాళేశ్వరం: హనుమాన్ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

శివసేనారెడ్డిని విడుదల చేయాలి



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: పోలీసుల అదుపులో ఉన్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిని వెంటనే విడుదల చేయాలని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో సీఎం కేసీఆర్ చెలగాటం అడుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో లీకేజీ, ప్యాకేజీ వ్యవస్థ నడుస్తుందని, చివరికి విద్యార్థుల జీవితాలతో కూడా కేసీఆర్ కుటుంబం సొమ్ము చేసుకుంటుందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. శివసేనారెడ్డి నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తుంటే అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం దుర్మార్గమన్నారు. శివసేనారెడ్డిని విడుదల చేసేంతవరకు పోరాటాన్ని ఆపేదిలేదన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బడితెల ప్రసాద్, రంజిత్, రజినీకాంత్, పథ్విరాజ్, మహేందర్, చరణ్, మహేష్, యాదవ్, కిషోర్ రెడ్డి, శ్రీకాంత్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మట్లాడుతున్న నాయకులు

మల్హర్: ఎండ తీవ్రత దృష్ట్యా మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో పని చేస్తున్న కార్మికులు కంపెనీ యజమాన్యం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు, బూడిద తిరుపతిలు డిమాండ్ చేశారు. మండలంలోని తాడిచర్లలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఓసీపీలో పని చేస్తున్న కార్మికులు ఎండ తాపాన్ని తట్టుకోలేక పోతున్నారని తెలిపారు. కార్మికులు పని చేసే చోట రెస్ట్ రూం ఏర్పాటు చేయాలని, బయటకు వచ్చినప్పుడు రెస్ట్ తీసుకునేందుకు రెస్ట్ షెల్టర్లు, కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పని స్థలంలో మజ్జిక, ఓఆర్ఎస్ ప్యాకేట్లు అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కాటారం: రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో బైక్‌యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధివిధానాలతో రాజ్యాంగానికి పెను ప్రమాదం పొంచి ఉందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని తొలిగించి మనుధర్మాన్ని తీసుకురావాలని బీజేపీ ప్రభుత్వం కుట్రపన్నుతుందని ఆరోపించారు. ప్రజలను చైతన్యం చేయడంలో భాగంగా బైక్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి గుర్రం దేవేందర్, ఆత్కూరి శ్రీకాంత్, కుందుగుల రాజన్న, బొడ్డు రాజ్‌కుమార్, బీరెల్లి మహేశ్, దేవేందర్, శ్రీధర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ నాయకులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. పిల్లలకు, పేదలకు పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణకు మారుపేరుని తెలిపారు. కేంద్రంలో రెండు సార్లు సొంతంగా అధికారంలోకి రావడం వెనుక ఎంతోమంది కార్యకర్తల కృషి పోరాటం ఉందన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



పలిలమె: జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు నిరంజన్



రేగొండలో..



చిట్యాలలో..



కాటారంలో..



మొగుళ్లపల్లిలో..

కంటి పరీక్షలు చేయించుకోవాలి



పలిమెల: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బుచ్చక్క



భూపాలపల్లి రూరల్: మోరంచపల్లిలో..

పలిమెల: కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ బుచ్చక్క అన్నారు. మండలంలోని సర్వాయిపేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని కంటి పరీక్షలు చేయించుకొని అవసరమైన వారు కంటి అద్దాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమ్మక్క, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్, హెల్ సిబ్బంది, సెర్ఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మోరంచపల్లి సర్పంచ్ లకిడె కమలబాయి తెలిపారు. భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్ కుమార్, మెడికల్ ఆఫీసర్ కార్తీక్, సీహెచ్ఓ రాజయ్య, వైద్య సిబ్బంది, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకిడె వెంకన్న, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బండి సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికం



పలిమెల: అరెస్ట్ అయిన నాయకులు

పలిమెల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ అప్రజాస్వామికం అని బీజేపీ మండల అధ్యక్షుడు కోయల్‌కార్ నిరంజన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సంజయ్ అక్రమ అరెస్టు నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీకి వస్తున్న అదరణ చూడలేకనే కేసీఆర్ బండి సంజయ్‌ని అక్రమంగా అరెస్టు చేసి రాక్షస అనందం పొందుతున్నారన్నారు. లిక్కర్ స్కాములు, పేపర్ల లీకేజీల నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకే సంజయ్ అరెస్టు చేశారని ఆరోపించారు. అనంతరం ధర్నాను అడ్డుకున్న పోలీసులు బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాలు, ఉపాధ్యక్షులు సదానందం, మైనార్టీ నాయకులు ఎస్‌కే నవాబ్, బూత్ అధ్యక్షులు చెన్నూరు సమ్మయ్య, నాయకులు గోనె రంజిత్, నరేష్, చంద్రశేఖర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: బండి సంజయ్ అరెస్ట్ రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్య అని బీజేపీ జిల్లా నాయకుడు మోలుమూరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ తాటాకు చప్పుళ్లకు బీజేపీ నాయకులు భయపడరని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పరిణామాలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

పలిమెల: బీజేపీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి పేర్కొన్నారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా ఎదో రకమైన గొడవలు సృష్టించి దొడ్డిదారిన అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేసే బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో పేపర్ లీకేజీకి కారణమయ్యి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. బీజేపీ కుట్రలను పసిగట్టిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రుల భయాన్ని ఆదిలోనే అంతం చేసిందన్నారు. బీజేపీ ఎన్ని కుతంత్రాలు పన్నినా రాష్ట్రంలో అధికారంలోకి రావడం అసంభవమన్నారు. ఇప్పటికైనా ఇలాంటి కుట్రలు మానుకోవాలన్నారు.

చిట్యాల: పదో తరగతి పేపర్ లీకేజీలో ప్రధాన నిందితుడిగా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నాయకులు విద్యార్థులను మానసికంగా కృంగదీస్తూ రాష్ట్రంలో అలజడులు సృష్టించి ప్రభుత్వ పాలనను అభాసుపాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు తొటం నవీన్, ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్రావు, ఎంపీటీసీ పద్మ నరేందర్, ఉపాధ్యక్షుడు గుర్రపు తిరుపతి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరస్వామి, పెరుమాండ్ల రవీందర్ గౌడ్, మాసు రమేష్, గుండా రవీందర్, రమణాచారి, రవీందర్, జాన్నే యుగందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'పై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంపై తెలంగాణ సంస్కృతిక సారథి కళాజాతా ఆధ్వర్యంలో టీం లీడర్ ఎర్రన్న బృందం ఆటపాటలతో అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేశ్వరి, సంగీత, ఏఎన్ఎం సుమలత, జయలత, సంధ్య, ఆశా వర్కర్ సునీత, కమల, కృష్ణవేణి, ఐకేపీ సీసీ లలిత, కళాకారులు మంకాల యాకోబ్, దుప్పటి రవి, ఖలీల్ భాషా, స్వప్న, బండారి అనిత, కంచర్ల శ్యామల, గడ్డం రజిత తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్సై

కాటారం: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పరీక్షలు కొనసాగుతున్న తీరుపై ఆరా తీసి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రంలోకి బయటివారిని అనుమతించవద్దని సూచించారు. డీఎస్పీ వెంట తహసీల్దార్ జివాకర్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఉన్నారు.

అనాథ పిల్లలకు చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న వనిత పూర్ణచందర్

మొగుళ్లపల్లి: అనారోగ్యంతో నాడు తల్లి, నేడు తండ్రి మృతి చెందగా ఇద్దరు పిల్లలు అనాథలవడంతో ఎంపీటీసీ ఎర్రబెల్లి వనిత పూర్ణచందర్‌రావు చేయూతనందిచాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన చెక్క శంకర్ దంపతులు కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారు. కాగా గతంలో శంకర్ భార్య అనారోగ్య కారణాలతో మృతిచెందింది. అప్పటి నుంచి శంకర్ కూలీ పనులు చేసుకుంటూ తన కుమారుడు అభిరాం (14), కుమార్తె రమ్య (16) లను చదివిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో శంకర్ కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. దీంతో ఎంపీటీసీ ఎర్రబెల్లి వనిత పూర్ణచందర్‌రావు అనాథలైన ఆ ఇద్దరు పిల్లలకు రూ.5000 తక్షణ సాయంగా అందించి పైచదువులకు ఆర్థిక సాయం అందిస్తానని మనోధైర్యం కల్పించారు. అభిరాం 9, రమ్య ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుకుంటుంది. తల్లిదండ్రులు కోల్పోయి అనాథలైన పిల్లలను దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జిల్లా అడిషనల్ కలెక్టర్ దివాకరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వేసవిలోగా చేపట్టాలని, నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జీఓ నంబర్ 317 ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లిన బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, హెల్త్ కార్డ్స్ అన్ని ఆస్పత్రిల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తిరుపతి, వెంకటరామిరెడ్డి, మహేందర్, కరుణాకర్, రమణారెడ్డి, రమేష్, దిలీప్ పాల్గొన్నారు.

పరామర్శ

చిట్యాల: మండలం లోని జూకల్ గ్రామానికి చెందిన ఎలమద్రి భిక్షపతి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ గొర్రె సాగర్ గురువారం పరామర్శించారు. సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఎంపీటీసీ జంబుల తిరుపతి, కొడారి రవి, ఉపసర్పంచ్ చాడ ఆనంద్ రెడ్డి ఉన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అనిత

టేకుమట్ల: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ అనిత అన్నారు. గురువారం మండలంలోని ఆశిరెడ్డిపల్లిలోని ఊర చెరువులో కొనసాగుతున్న పూడిక తీత పనులను ఎంపీడీఓ పరిశీలించి మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉంది కావున ఉదయాన్నే పనులకు వచ్చి పనులు పూర్తి చేసుకోవాలన్నారు. కూలీలకు తగిన సౌకర్యాలను కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీ, పల్లె ప్రకృతి వనంలను పరిశీలించారు. ఆమె వెంట ఈసీ రాము, టీఏ మహేందర్, తదితరులు ఉన్నారు.